# నిబంధనలకు పాతర..ప్రలోభాల జాతర

- డబ్బు, మద్యంతో ప్రజలను ఏమార్చేందుకు యత్నాలు
- వైఎస్సార్‌సీపీ నాయకులను ప్రభావితం చేయడమే లక్ష్యం
- నెరవేరని కుటిల ప్రయత్నాలు
- నామినేషన్‌కు బలనిరూపణలో నిబంధనలకు తిలోదకాలు
- విచ్చలవిడిగా నగదు, మద్యం, బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ


కర్నూలు రోడ్డులో మద్యం తాగుతున్న టీడీపీ కార్యకర్తలు


వైఎస్సార్‌సీపీ నేత పి.మురళీధర్‌రెడ్డి ఇంటి ముందు గొడవకు తెగబడ్డ తెలుగుతమ్ముళ్లు

**పత్తికొండ రూరల్:** తెలుగుతమ్ముళ్లు నిబంధనలకు పాతరేసి ప్రలోభాల జాతర చేశారు. అయినా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మస్థైర్యాన్ని చెక్కుచెదపలేకపోయారు. పత్తికొండలో బుధవారం టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు నామినేషన్ సందర్భంగా నిబంధనలకు నీళ్లొదిలి పలు గ్రామాల్లో ప్రజలకు డబ్బు, మద్యం, చికెన్ బిర్యానీ ఎరగా చూపించి నామినేషన్‌కు తరలించే ప్రయత్నం చేసినా నామినేషన్ ఘట్టం చప్పగా సాగింది. చుట్టుపక్కల గ్రామాలతో పాటు స్థానిక కాలనీల్లోని యువకులు, మహిళలు, ఉపాధి కూలీలకు రూ.300 చొప్పున కూలీ ఇచ్చి తరలించినా ప్రచారం అనుకున్నంత ఆర్భాటంగా సాగలేదు. బుధవారం ఉదయం 11 గంటలకు నామినేషన్ అంటూ కార్యకర్తలెవరూ రాకపోవడంతో వారికోసం ఎదురుచూస్తూ మధ్యాహ్నం 2 గంటలైనా ర్యాలీ కొనసాగిస్తూ వచ్చారు. మండుటెండలో దాహం తీర్చుకునేందుకు పార్టీ కార్యకర్తలు, మహిళా కూలీలు అవస్థలు పడ్డారు.

**నాయకుల తికమక..**

స్థానిక మార్కెట్‌యార్డు నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా వచ్చి కేఈ శ్యాంబాబు నామినేషన్ దాఖలు చేస్తారని పార్టీ నాయకులు మంగళవారం ప్రచారం చేశారు. 11 గంటల సమయంలో కేవలం కొద్దిమంది నాయకులతో వచ్చి శ్యాంబాబు నామినేషన్ దాఖలు చేసి వెళ్లిపోయారు. ఆ తరు వాత వ్యవసాయ మార్కెట్‌యార్డు వద్దకు వెళ్లి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా ప్రచార రథంపై బయల్దేరారు. అయితే అప్పటికే నామినేషన్ ప్రక్రియ ముగియడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తలు తిరుగుముఖం పట్టారు. ఎన్నిగంటలకు నామినేషన్, ఎన్నిగంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందో ఆపార్టీ నాయకులకే తెలి యని అయోమయ పరిస్థితి నెలకొంది. కాగా సీఎం జగనన్న పాటల లిరిక్స్‌తోనే ఉన్న డీజే పాటలతో టీడీపీ కార్యకర్తలు స్టెప్పులేస్తూ 'రావాలి జగన్..కావాలి జగన్' అంటూ చిందులేయడం గమనార్హం.

**అలకబూనిన తెలుగు తమ్ముళ్లు**

టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న కేఈ శ్యాంబాబుకు తెలుగుతమ్ముళ్ల నుంచి ఎదురుదెబ్బ తగిలినట్టైంది. బాబాయ్ కేఈ ప్రభాకర్‌తో పాటు నియోజకవర్గ నాయకుడు సాంబశివారెడ్డి సైతం గైర్హాజరయ్యారు. కేఈ ప్రభాకర్ వర్గంగా ఉంటూ కొద్దికాలంగా దూరంగా ఉంటున్న జెడ్పీటీసీ మాజీ సభ్యులు ఈడిగ సుకన్య కుటుంబీకులు కనకదిన్నె నాగయ్యగౌడ్, మరికొందరు ముఖ్యనేతలు నామినేషన్‌కు దూరంగా ఉన్నారు.

**పస లేని ప్రసంగం**

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో నియోజకవర్గంలోని 64 చెరువులు నింపే బృహత్కర కార్యక్రమాన్ని ఇప్పటికే ప్రారంభించడం జరిగింది. దశాబ్దాల తరబడి ఎన్నికల ప్రధాన హామీగా టమాట జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు, పట్టణంలోని రోడ్ల అభివృద్ధి పనులు జరుగుతున్నా ప్రజలను మభ్యపెడుతున్నట్లుగా శ్యాంబాబు ప్రసంగించడం చూసి జనం నవ్వుకున్నారు. ఆయన అజ్ఞానానికి నిదర్శనమని కొందరు పేర్కొన్నారు. ఈప్రాంతంలోని యువత గంజాయికి, మద్యానికి బానిసలైపోయారని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

**● గొడవలు సృష్టించాలని..**

స్థానిక చత్రాళ్ల రోడ్డులోని వైఎస్సార్ సర్కిల్‌లో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులను దూషిస్తూ తెలుగుతమ్ముళ్లు హల్‌చల్ చేశారు. అదే సమయంలో అక్కడే ఉన్న వైఎస్సార్‌సీపీ నేత పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి వాహన డ్రైవర్ ఆంజనేయులుపై దాడికి తెగబడ్డారు. పక్కనే ఉన్న పార్టీ శ్రేణులు అప్రమత్తమై అతన్ని పక్కకు తప్పించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పి.మురళీధర్‌రెడ్డి వివాదాన్ని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినా ఏమాత్రం లెక్కచేయకుండా వారు గట్టిగా కేకలు వేస్తూ రెచ్చిపోతూ గొడవకు పన్నాగం పన్నారు. విషయం తెలుసుకుని ఎస్‌ఐ గోపాల్, పోలీసు సిబ్బంది అల్లరి మూకలను చెదరగొట్టారు.

**● కర్నూలుకు ఉపాధి కూలీల తరలింపు**

పత్తికొండ పరిధిలోని ఉపాధి కూలీలను టీడీపీ నాయకుల నామినేషన్ కార్యక్రమం నిమిత్తం కర్నూలు తరలించారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి పంచలింగాల నాగరాజుకు సమీప బంధువు ఇక్కడ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. అతడు కర్నూలుకు కచ్చితంగా వెళ్లాలని ఆదేశించడంతో ఉపాధి కూలీలు చేసేదేమీ లేక అగచాట్లు పడుతూ మండుటెండలో కర్నూలుకు వెళ్లారు.

## వాల్మీకి జీవితం ఆదర్శం


ప్రతిష్ఠించిన వాల్మీకి విగ్రహం

**ఆస్పరి:** ప్రతి ఒక్కరూ వాల్మీకి మహర్షి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని అచ్యుతానంద స్వామీజీ సూచించారు. బుధవారం మండలంలోని హలిగేర గ్రామంలో గ్రామస్తులు, భక్తులు సహకారంతో రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించిన ఆలయంలో అచ్యుతానందస్వామీజీ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపన జరిగింది. అంతకు ముందు గ్రామంలో ఎద్దుల బండిపై వాల్మీకి మహర్షి విగ్రహం, కలశాలను మేళతాళాలతో భక్తులు ఊరేగించారు. ఆలయంలో యంత్ర ప్రతిష్టాపన, అలంకరణ, జయాది హోమం, పూర్ణాహుతి, మహా మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామీజీ వాల్మీకి మహర్షి జీవితం గురించి భక్తులకు వివరించారు. భక్తులకు అన్నదానం చేశారు. పూజనంతరం ఎమ్మెల్సీ మధుసూదన్, సర్పంచ్ లింగమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు బుసినె వెంకటేష్ వాల్మీకి మహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు.


కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

## క్లుప్తంగా

### నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు


విరూపాక్షి

**చిప్పగిరి:** ఈనెల 23న తన నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చిన ఆలూరు నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలని వైఎస్సార్‌సీపీ ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి బుసినే విరూపాక్షి అన్నారు. బుధవారం ఆయన తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ ఇదే ఉత్సాహంతో మే 13న ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని కోరారు.

### టీడీపీ కార్యకర్తల ఓవరాక్షన్

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి


గాయం చూపుతున్న చక్రపాణి, సంటెన్న

**కృష్ణగిరి:** మండల పరిధిలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు పందిర్లపల్లె కర్రెన్న, ఎల్లయ్య, కృష్ణయ్య ఓవరాక్షన్ చేశారు. బుధవారం వారు టీడీపీ పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి నామినేషన్‌కు వెళ్లారు. అక్కడ పూటుగా మద్యం తాగి తిరిగి గ్రామానికి చేరుకుని ఎస్సీ కాలనీలో కేకలు వేస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులను బూతులు తిట్టారు. వారించబోయిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సంటెన్న, అతని కుమారుడు చక్రపాణిపై దాడికి దిగారు. బాధితులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు.

### చికెన్ షాపు దగ్ధం

**వెల్దుర్తి(కృష్ణగిరి):** పట్టణంలోని పాతబస్టాండు సమీపంలో ఉన్న చికెన్‌షాపు బుధవారం దగ్ధమైంది. యజమాని బొమ్మిరెడ్డిపల్లె లక్ష్మన్న సాయంత్రం షాపులో ఉండగా విద్యుదాఘాతంతో మంటలు రేగాయి. లక్ష్మన్న బయటికి పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నాడు.

### వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేద్దాం

**దేవనకొండ:** వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ తపాల శ్రీను, మండల జేసీఎస్ కన్వీనర్ రాజారెడ్డి సూచించారు. ఈనెల 23న విరూపాక్షి నామినేషన్ కార్యక్రమానికి వచ్చిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వారు పేర్కొన్నారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం

**ఆలూరు రూరల్:** హాలహర్వి మండలం మెదేహాల్ గ్రామం వద్ద బుధవారం అర్థగేరి గ్రామానికి చెందిన మంజునాథ్‌ను అరెస్ట్ చేసి అతని నుంచి 2 బాక్స్‌ల కర్ణాటక మద్యం, బైక్ సీజ్ చేసినట్లు సెబ్ సీఐ సోమశేఖర్ తెలిపారు.

### కుదరని కూటమి

**ఆలూరు:** కూటమి నాయకుల మధ్య సయోధ్య కుదరడం లేదు. స్థానిక వాసవీకల్యాణ మండపంలో బుధవారం ఏర్పాటు చేసిన టీడీపీ నాయకుల సమావేశానికి బీజేపీ, జనసేన నాయకులు గైర్హాజరయ్యారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, జోనల్ ఇన్‌చార్జ్ వైకుంఠం ప్రభాకర్‌చౌదరి, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాదు, మాజీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, అసెంబ్లీ అభ్యర్థి వీరభద్రగౌడు హాజరయ్యారు. పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించగా.. గతంలో పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇక్కడి నాయకులు ఒక్కొక్కరిని ఒక్కో విధంగా చూశారని, ఇప్పుడు కలిసి పని చేయాలంటే ఎలా అని కొందరు తిక్కారెడ్డి ఎదుటే అసంతృప్తి వెళ్లగక్కారు. కాగా నామినేషన్ కార్యక్రమానికి తరలించిన జనాలకు డబ్బులు ఖర్చు పెట్టుకున్నా వీరభద్ర గౌడ్ ఇప్పటి వరకు ఇవ్వలేదంటూ కొందరు జనసేన నాయకులు ఆయన దృష్టికి తెచ్చారు.

### నేటి నుంచి సాయిబన్న దాదా ఉరుసు

**హొళగుంద:** మండల కేంద్రంలో వెలిసిన సాయిబన్నదాదా ఉరుసు గురువారం నుంచి 27వ తేదీ వరకు జరుగుతుందని దర్గా నిర్వాహకులు బుధవారం తెలిపారు. 25న గంధం, 26న ఉరుసు, 27న జియారత్‌తో కార్యక్రమాలు ముగుస్తాయన్నారు.

### నేడు బండలాగుడు పోటీలు


**వెల్దుర్తి(కృష్ణగిరి):** బ్రహ్మోత్సవాల్లో భాగంగా రామళ్లకోటలో పాలపండ్ల వృషభాలకు 25వ తేదీ గురువారం బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలి పారు. విజేతలకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10వేలు బహూకరించనున్నట్లు తెలిపారు. సాయంత్రం గుండ, చందా ఎత్తు పందెములు, మనిషి గిరక బండి లాగు పందెం, తాడు పందెం, ట్రాక్టర్ రివర్స్, బైక్‌స్లో పందెములు నిర్వహించనున్నామన్నారు.

### ఆరో రోజు మూడు నామినేషన్లు

**ఎమ్మిగనూరు టౌన్:** సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎమ్మిగనూరు అసెంబ్లీ స్థానానికి ఆరో రోజు బుధవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో కాంగ్రెస్ అభ్యర్థిగా ఖాశింవలి రెండో సెట్ నామినేషన్ దాఖలు చేయగా ఇండిపెండెంట్ అభ్యర్థులుగా రాజశేఖర్, విజయలక్ష్మి రెండు నామినేషన్లను దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిరంజీవి తెలిపారు.

**ఆలూరు రూరల్:** ఆలూరు అసెంబ్లీకి బుధవారం ఆరు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి రాము నాయక్ తెలిపారు.

# రమణీయం - వనం వెంకటేశుని రథోత్సవం


రామళ్లకోట వనం శ్రీలక్ష్మీ వెంకటేశ్వరుడి రథోత్సవం

**వెల్దుర్తి(కృష్ణగిరి):** బ్రహ్మోత్సవాల్లో భాగంగా రామళ్లకోట వనం శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి రథోత్సవం కడు రమణీయంగా సాగింది. బుధవారం భూదేవి, శ్రీదేవి సమేత వనం శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చింతకాయల వెంకటేశ్వర్లు, సర్పంచ్ నిర్మల, ఎంపీటీసీ నాగలక్ష్మమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి రామళ్లకోట మాధవ స్వామి ఆధ్వర్యంలో రథోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన అశేష జనవాహిని కనులారా తిలకించి పులకించారు. ముందుగా రథానికి ఆలయ పూజారులు దేవలం సురేశ్, ఆస్థాన పండితులు ములుకుట్ల ఆంజనేయ శర్మ సోదరుల సారథ్యంలో సంప్రోక్షణ, హోమం, రథబలి, మహామాయ పూజ చేసి దేవతామూర్తులను రథారోహణ గావించారు. దాదిరెడ్డి సురేంద్రనాథ్ రెడ్డి, జగన్నాథరెడ్డి, కొప్పరపు లింగం రామయ్యశెట్టి సేవాకర్తలుగా రథాన్ని, ఆశీనులైన దేవతామూర్తులను సుందరంగా అలంకరించారు. మంగళవాయిద్యాలు, గోవింద నామస్మరణ మధ్య భక్తులు రథాన్ని లాగుతూ రథశాల నుంచి మాడవీధిలో 500 మీటర్ల మేర లాగారు. అనంతరం తిరిగి రథశాలకు చేర్చారు. రాత్రి స్వామి వారి పారువేట కార్యక్రమం నరసింహుడు, మల్లికార్జున, మద్దయ్య, మహేశ్‌లు సేవాకర్తలుగా నిర్వహించారు. చెక్కభజన ఆకట్టుకుంది.

### ఘనంగా లంకా దహనం

**హొళగుంద:** మండల పరిధిలోని గజ్జహళ్లి గ్రామంలో పోతులింగేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి లంకాదహన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. దాదాపు గంటన్నర పాటు బాణా సంచా కాల్చుతూ భక్తులు సంబరాలు చేసుకున్నారు. ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.


లంకాదహనం సందర్భంగాబాణాలు కాల్చుతున్న దృశ్యం

# పేదల సంక్షేమానికి జగనన్న పెద్దపీట


మారెళ్లలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి


ఎమ్మెల్యే శ్రీదేవి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరిన టీడీపీ నాయకులు

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

**తుగ్గలి:** పేదలు సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం కోడలు రమ్యరెడ్డితో కలిసి మారెళ్ల గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా సీఎం జగనన్న సంక్షేమ పథకాలు అందించారని, గత టీడీపీ ప్రభుత్వం పేదలను పట్టించుకోలేదని ఆమె విమర్శించారు. తమ ప్రభుత్వంలో గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించామని దీంతో ప్రజలకు కావాలసిన సౌకర్యాలు త్వరితగతిన స్థానికంగా అందుకున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రంలో జగన్ గాలి వీస్తుందని, మరోసారి జగన్ సీఎం కావడం ఖాయమన్నారు. ఓటమిని జీర్ణించుకోలేక టీడీపీ సైతం అడ్డుకుంటుందన్నారు. గత ఐదేళ్లలో టీడీపీ పాలన, ఈ ఐదేళ్లలో జగనన్న పాలనలో తేడాను గమనించి మేలు చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. నిత్యం అందుబాటులో ఉంటున్న తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, లింగన్న, వెంకటేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

**వైఎస్సార్‌సీపీలో చేరిక**

**పత్తికొండ రూరల్:** మండల పరిధిలోని చందోలి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. కోసిగి లక్ష్మన్న, రంగనాయకులు, చింతలకొండ సురేంద్ర, రోషప్ప, మహానందితో పాటు మరికొందరికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

**పార్టీ కార్యాలయం ప్రారంభం**

**మద్దికెర:** మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంగాటి ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నో పథకాలను అమలు చేసి, పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, నాయకులు శివారెడ్డి, మల్లికార్జున, విజయుడు, ఆంజనేయులు, రామకృష్ణ, రామకృష్ణారెడ్డి, ఆంజనేయులు, సొసైటీ అధ్యక్షులు శాంతన్న, సుబ్బ య్య, మాజీ సర్పంచు వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ మల్లికార్జున, మైనారిటీ నాయకులు ఖాజావలి పాల్గొన్నారు.


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

**ఫ్యాను గుర్తుకు ఓటేయండి**

**వెల్దుర్తి(కృష్ణగిరి):** ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తన తల్లి కంగాటి శ్రీదేవిని మరోసారి గెలిపించాలని ఆమె తనయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు రామ్మోహన్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన వెల్దుర్తి మండల పరిధిలోని ఎల్ నగరం గ్రామంలో సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ సమీర్‌కుమార్‌రెడ్డితో కలిసి ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ ఎంపీగా బీవై రామయ్యను, ఎమ్మెల్యేగా కంగాటి శ్రీదేవిను గెలిపించుకునేందుకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలని అభ్యర్థించారు.

# సంక్షేమ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలి


బోదేపాడు రోడ్ షోలో మాట్లాడుతున్న బుట్టా రేణుక


ఎమ్మిగనూరులోలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న బుట్టా రేణుక.

- వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు అసెంబ్లీ అభ్యర్థి బుట్టా రేణుక


**ఎమ్మిగనూరు టౌన్:** కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలని ఆ పార్టీ ఎమ్మిగనూరు అసెంబ్లీ అభ్యర్థి బుట్టా రేణుక కోరారు. బుధవారం సాయంత్రం స్థానిక 13వ వార్డులో కౌన్సిలర్ జమీల, వార్డు ఇన్‌చార్జ్, కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్ షబ్బీర్‌అహమ్మద్, రాష్ట్ర వీరశైవలింగాయత్ చైర్మన్ రుద్రగౌడ్, పార్టీ శ్రేణులతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన మంచిని వివరించి మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో వచ్చే టీడీపీ నాయకులను నమ్మవద్దన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరుతో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను ఇళ్ల వద్దకే చేర్చుతున్నారన్నారు. అలాంటి నాయకుడిని మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకుందామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, మున్సిపల్ కౌన్సిలర్లు ఖాశింబేగ్, వాహిద్ ఇషాక్, షాబుద్దీన్, గట్టురఫీక్, జీఎం బాషా, రజాక్, డిష్ రఫీక్, లియాఖత్ పాల్గొన్నారు.

**అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తా**

**గోనెగండ్ల:** తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తానని వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు అసెంబ్లీ అభ్యర్థి బుట్టా రేణుక అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆమె మండలంలోని కున్నూరు, పాత బోదేపాడు, కొత్త బోదేపాడు, తిప్పనూరు, వీరంపల్లి గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు. ప్రజారంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకునేందుకు ఫ్యాన్‌గుర్తుపై ఓటేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలోఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు శివనీలంఠ, కృష్ణారెడ్డి, పెద్ది రెడ్డి, కాశీరెడ్డి, దొరబాబు, శ్రీరామ్ రెడ్డి, మధు సుధన్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, పెద్ద వాసు రెడ్డి, కృష్ణవేణి, లక్ష్మిదేవి, భక్తవత్సల్ రెడ్డి, వెంకటేష్, మద్దయ్య, రాజు, జయన్న, లక్ష్మినారాయణ రెడ్డి, నాగ సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

**● అత్త విజయం కోసం కోడలు ప్రచారం**

**ఎమ్మిగనూరు టౌన్:** బుట్టా రేణుకను గెలిపించాలని ఆమె కోడలు సాహితి బుధవారం పట్టణంలోని 19వ వార్డులో ప్రచారం నిర్వహించారు. కౌన్సిలర్ పూజేశ్వరితో కలిసి ఇంటింటికి వెళ్లి సీఎం వైఎస్ జగనన్న మంజూరు చేసిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం ఆర్థికంగా లబ్ధిపొందిందని, అవి కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు.


బుట్టా రేణుకకు ఓటేయాలని మహిళలను కోరుతున్న సాహితి

**● గోనెగండ్లలో..**

మండల కేంద్రంలోని ధనబండ మసీద్, ఉప్పర వీధి, నగిరి గేరి, బిలాల వీధి, దర్గా వీధి, కటికే వీధి, బగిలి గేరి, ముల్లా వీధుల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తన తల్లి బుట్టా రేణుకను గెలిపించాలని ఆమె తనయుడు బుట్టా ప్రతుల్ కోరారు. ప్రచారంలో పార్టీ నాయకులు బందెనవాజ్, మురళి నాయుడు, గోవింద్, రవికుమార్ నాయుడు, ఉమాదనంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గోనెగండ్లలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న బుట్టా ప్రతుల్

# అంబరం.. అంజన్న సంబరం



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి విగ్రహం, భారీ ర్యాలీలో పాల్గొన్న భక్తులు

- హొళగుందలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు
- ర్యాలీకి తరలివచ్చిన యువత

**హొళగుంద:** మండలంలో బుధవారం హనుమాన్ జయంతి సంబరాలు అంబరాన్నంటాయి. మండల కేంద్రంలో యువకులు, పెద్దలు, హనుమాన్ మిత్ర మండలి సభ్యులు భారీ ఎత్తున తరలి వచ్చి ఊరేగింపులో పాల్గొన్నారు. పురవీధుల్లో స్వామి చిత్రపటాన్ని ఊరేగింపు నిర్వహించారు. మండల కేంద్రానికి 5 కి.మీ దూరంలో వెలిసిన అగ్రహార ఆంజనేయస్వామిని దర్శించుకోవడానికి భక్తులు తరలి వచ్చారు. ఆలయ ప్రదక్షిణ, అభిషేకాలు, పవమాన హోమం, మహామంగళ హారతి, అలంకారం, ఆకుల అర్చన, రుద్రాభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే భజన కార్యక్రమాలు నిర్వహించారు. హొళగుంద, లింగంపల్లి, గజ్జహళ్లి, వందవాగిలి తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతిలో భాగంగా ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించి అన్నదానం చేశారు. ఇదిలా ఉండగా మండల కేంద్రం హొళగుందలో రెండేళ్ల క్రితం చోటుచేసుకున్న ఘర్షణను దృష్టిలో ఉంచుకుని పోలీసులు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. ఆలూరు, ఆదోని తాలూకా సీఐలు వెంకటేశ్వర్లు, నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో హొళగుంద ఎస్‌ఐ పెద్దయ్యనాయుడుతో పాటు హాలహర్వి, చిప్పగిరి ఎస్‌ఐలతో పాటు ఆలూరు సర్కిల్ పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

### చలివేంద్రం ఏర్పాటు

**చిప్పగిరి:** మండలంలోని నగరడోణ గ్రామంలో స్టార్ ఫ్రెండ్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన సీతప రెడ్డి సహకారంతో బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవి కాలం కావడంతో ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో లింగారెడ్డి, రమేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.